# పునరపి జననం

హైమా భాస్కర్



**రాజసూయ యాగం ఎక్కడా కనీ వినీ ఎరగనంత వైభవోపేతంగా జరిగింది. పాండవుల ఆతిథ్యాన్ని స్వీకరించిన కృష్ణుడు తన స్వస్థలానికి మరలేందుకు సన్నాహాలు మొదలెట్టాడు. అంబరాన్ని తాకిన పాండవుల సంబరాలే కాకుండా, మరొకరి నయనాల నుండి కురిసిన దుఃఖ వీచికలు కూడా శ్రీకృష్ణుని అంతరంగాన్ని సోకాయి. ఆ వ్యక్తి శిశుపాలుని తల్లి. కృష్ణుని మనోనేత్రానికి శోకమూర్తి అయిన అత్తయ్య పొడగట్టింది. ఆమెకు గీతోపదేశం చేయవలసిన సమయం ఆసన్నమైందని గ్రహించిన శ్రీకృష్ణుడు అత్తయ్య ఇంట్లో కాలు మోపాడు. పుట్టెడు దుఃఖంలో ఉన్న అత్తయ్య కంట నీరు తుడుచుకుని కృష్ణుని ఆదరించింది. ఆతిథ్య మిచ్చింది.**

ఆరగించిన మాధవుడు చిరునవ్వుతో అత్తవైపు చూశాడు. "నీ స్వహస్తాలతో వడ్డించిన ఈ కమ్మటి భోజనం అమృతతుల్యంగా ఉం దత్తా!" అన్నాడు.

అప్పటివరకు అణచి ఉంచుకున్న ఆక్రోశం అత్తయ్యలో అగ్నిపర్వతంలా బద్దలైంది. "నా కొడుకు మృత శరీరం కళ్లముందు కదులుతుంటే అమృతంలాంటి భోజనం ఎలా పెట్టగల నయ్యా?" అంది ఆర్తిగా.

ఆమెనుండి అటువంటి సమాధానం వస్తుందని తెలిసిన కృష్ణుడు ఆ మాతృ హృదయంలోని క్షోభను అర్థం చేసుకున్నాడు. "అత్తా! గతం గతః. దాని గురించి ఆలోచించకు. నీ ముందున్న మహాప్రస్థానాన్ని తలుచుకో. మోక్షమార్గం వైపు మనసును మరలించుకో!" అన్నాడు.

"సంతోషం లేని మోక్షం నా కెందుకయ్యా? నా

బిడ్డను పొట్టన పెట్టుకున్నది చాలక ఆ దుఃఖాన్ని మరిచిపొమ్మంటావా? అలా అనడానికి నీకు నోరెలా వచ్చింది?" అంది ఆవేశంగా.

"అత్తా! బిడ్డలవల్ల, అజ్ఞానంవల్ల వచ్చే పైపై సంతోషాల వల్ల మోక్షం రాదు. నిజమైన జ్ఞానంవల్ల కలిగే సంతోషమే మోక్షాన్నిస్తుంది. నీకు కావలసింది ఇలాంటి మోక్షమే. తప్పులు చేసే తనయులవల్ల తల నొప్పులు వస్తాయి కానీ, తల్లి మనసుకు శాంతి రాదత్తా!'' అన్నాడు.

"మగవాడివి. నీకు తల్లి మనసు ఎలా అర్థమవుతుంది? ఈ చేతులతో పెంచిన నా చిన్నతండ్రిని ఈ చేతులతోనే..." అంటూ భోరుమంది శిశుపాలుడి తల్లి.

కృష్ణు డామెను దగ్గరకు తీసుకుని ఓదార్చాడు.

"కృష్ణా! సాక్షాత్తు భగవంతుడివైన నీ ఓదార్పు కూడా నా మనసును చల్లబరచలేదు. అగ్నిగుండంలా ఉన్న నా మనసుకు నీ ఓదార్పు అగ్నిలో పోసిన ఆజ్యంలా ఉంది. నా కొడుకు మూర్ఖుడే. కాదనను. కానీ గొప్పవాడివైన నీవు అంత కఠినంగా నా కొడుకును శిక్షించకపోతే క్షమించి ఉండకూడదా?'' నిష్ఠూరంగా అం దా మాతృమూర్తి.

కృష్ణుడు నిట్టూర్చాడు. మాతృప్రేమకూడా మనసులో అంధత్వాన్ని నింపుతుంది అనుకున్నాడు. "అత్తా! నీకు మాటిచ్చినట్లే వంద తప్పుల వరకు సహించాను. ఆ తర్వాతే నీ కొడుకును శిక్షించాను. ఇంత సహనం చూపినా నా మీద కర్కోటకు డనే నింద వేస్తావా?'' అన్నాడు.

అల్లుడి వైపు తలెత్తి చూసి అత్తయ్య తల దించుకుంది. "నువ్వన్నమాట నిజమే. నా బిడ్డ లక్ష తప్పులు చేసినా నేను లెక్క పెట్టను. ఎందుకంటే నేను కన్న తల్లిని. కానీ నువ్వు తల్లివి కావు. అందుకే చేసిన తప్పులను అదే పనిగా లెక్కపెట్టి నూరు తప్పులు కాగానే శిరచ్ఛేదం చేశావు. అదే నీకూ, నాకూ ఉన్న భేదం!'' అంది బాధగా.

"నీ బాధ నంతా బయటికి రానివ్వు! అప్పుడే నీ మనసు చల్లబడుతుంది. నాకు నీ మీద కోపం ఏమీ లేదు!'' అంటూ అత్తయ్య ఆవేశం, ఆక్రోశం చల్లబడేవరకు శ్రీకృష్ణుడు అనునయిస్తూనే ఉన్నాడు.

ఆడవలసిన నిష్ఠూరాలు, కార్చవలసిన కన్నీళ్లు ముగిసిన తర్వాత శిశుపాలుని తల్లికి ఇంకేమని మాట్లాడాలో అర్థం కాలేదు. భగవత్స్వరూపుడైన కృష్ణుడు తన ముందు వినయంగా కూర్చుని తన నిష్ఠూరాలను మౌనంగా భరించడం చూసి ఆమె అపరాధ భావంతో తల దించుకుంది.

"కృష్ణా! నా బాధ కొద్దీ ఎన్నో అన్నాను. అవన్నీ మరిచిపో!'' అంది.

"అర్థం చేసుకోగలిగినవాడే అన్ని మాటలనూ శాంతంగా వినగల డత్తా! మధ్యలోనే ఆపేసి ఆవేశంగా అరిచేవాడు ఆత్మీయుడు ఎలా అవుతాడు? నేను నీ ఆత్మబంధువును కదా! ఆ మాత్రం అర్థం చేసుకోవద్దా!' ' అని ఆమెను ఊరడించాడు.

"కృష్ణా! ఈ పుత్రశోకం నుండి న న్నెలా కాపాడుతావు? మరణం అనేది ఇంత తీవ్రంగా ఉంటుందని నాకు తెలియదే!" అని దుఃఖించింది.

"అత్తా! మరణించేది జీర్ణ శరీరమే. ఆత్మకు మరణం ఉండదు. మనిషి కొత్త అంగీని ధరించినట్లు ఆత్మ మరో శరీరాన్ని ధరిస్తుంది. కొత్త వస్త్రాలను ధరిస్తున్నందుకు సంతోష పడాలేకానీ, జీర్ణవస్త్రాన్ని చూసి బాధపడ కూడదు!'' అన్నాడు.

"అంటే, నిజంగా పునర్జన్మ అనేది ఉందంటావా? పూర్వ జన్మ పుణ్యం, పాపం అనేవి నిజమా?'' అంది అత్తయ్య.

"పునర్జన్మ అనేది ఉంది. మరణించా డనుకున్న నీ కొడుకు వేరే జన్మకు సిద్ధమవుతున్నాడు!'' అన్నాడు కృష్ణుడు.

"అవునా? ఎంత చల్లని మాట చెప్పావు తండ్రీ! కలకాలం ఒకే శరీరంలో చిరంజీవిగా లేకపోయినా, ఆత్మ చిరంజీవిగా ఉండి శరీరాలు మారడం కాస్త ఓదార్పునిస్తోంది, తండ్రీ! నా కొడుకు ఇలా ఎన్నిసార్లు జన్మిస్తాడు తండ్రీ?'' అంది.

"నీ కొడుకు పుణ్యం కంటే పాపం ఎక్కువ చేసిన పాపాత్ముడు. కనుక ఈ అనంత కాలభ్రమణంలో కొన్ని వేలసార్లు పుట్టక తప్పదు. కలియుగాంతం వరకు జన్మిస్తూనే ఉంటాడు!'' అన్నాడు.

"కలియుగమా? అప్పటివరకూ నా కొడుకు జన్మించవలసిందేనా? ని న్నెప్పుడు చేరుకుంటాడు?'

"నీ కొడుకు కలియుగంలో ఎన్నోసార్లు పుడుతూనే ఉంటాడు. ఆ యుగంలో నన్ను చేరుకునే వాళ్లు చాలా తక్కువమంది ఉంటారు!'' అన్నాడు కృష్ణుడు.

"కలియుగం పాప కాల మని అంటారే! అప్పుడు నా కొడుకు ఎలా పుడతాడు? ఏం చేస్తాడు?'' ఆందోళనతో అంది అత్త.

"భవిష్యద్వాణి వింటే బాధ కలుగుతుందేమో!'' అనుమానంగా అన్నాడు కృష్ణుడు.

"ఇప్పు డున్న బాధకంటే అదేమీ ఎక్కువ కాదు. నాకు భవిష్యద్వాణి వినిపించు!'' ఆత్రుతగా అంది అత్తయ్య.

"అత్తా! పూర్వ జన్మ వాసనలు ఏ వ్యక్తినీ వదలవు. నీ కొడుకు ఈ జన్మలోని లక్షణాలతోనే కలియుగాంతం వరకు జన్మిస్తాడు. ఈ కాలంలోని తప్పులే కలియుగంలో స్కాము లంటారు. ఇప్పుడు స్వాములవార్లు ఎక్కువ ఉంటే, అప్పుడు స్కాముల్లో తల పండిన పరిపాలకులు ఉంటారు. నీ కొడుకు చేది భూపాలుడు. కలియుగంలో కూడా పరిపాలకుడిగా ఉండి రాజ్య కాంక్షను కలిగి ఉంటాడు. నన్ను పశువుల కాపరని తిట్టిన నీ కొడుకు పశుగ్రాసం కోసం వినియోగించవలసిన సొమ్ము మొత్తాన్ని తిని పశువు కంటే హీనంగా ప్రవర్తిస్తాడు. నా సుదర్శన చక్రం అతని కంఠానికి తగలడం వలన, అతని కులం పేరు నా కులం పేరుతో కలుస్తుంది. నన్ను అనుకరించే ప్రయత్నం చేయబోతాడు. నరకాసుర సంహారం నాడు సత్యభామ నాకు సహాయం చేసినట్లు తన భార్య కూడా తనకు సహాయంగా ఉండా లనుకుంటాడు. పదవీచ్యుతుడైనా అర్థాంగిని అడ్డం పెట్టుకుని పాలించాలనే కుబుద్ధి విడనాడడు. జనంకూడా వంద తప్పుల వరకు సహించినా మరల విడిచిపెట్టరు. ఇటువంటి అవతారాలు ఎన్నో ఎత్తి ప్రజలకు తల నొప్పులు తెస్తాడు! ...'' ఇంకా ఏదో చెప్పబోతున్న కృష్ణుని వారించింది శిశుపాలుని తల్లి.

"కన్నయ్యా! ఇక వినదలుచుకోలేదయ్యా! పుట్టలోని చెదల్లాంటి పుత్రుడు పుట్టినా, గిట్టినా ఇక నాకు లెక్కలేదు. ఇలాంటి బిడ్డ తల్లి పేరు ఫలానా అనకుండా చరిత్రలో నా పేరు లేకుండా చెయ్యి, తండ్రీ! నాకు జన్మంటూ వద్దు. ఉంటే మంచి పుత్రుడిని ప్రసాదించు!'' అంటూ నమస్కరిస్తున్న అత్తయ్య దగ్గర సెలవు తీసుకుని తన మందిరం వైపు నడిచాడు శ్రీకృష్ణుడు.

Ⓟ

